

పంటలకు శ్వాస.. రైతులకు ప్రయాస..

పంటల దిగుబడిపై యూరియా ప్రభావం

- వరి నాట్లు వేసినప్పటి నుంచే అవసరం
- పత్తి పంట పచ్చగా, ఏపుగా పెరిగేందుకు కీలకం
- మొక్కజొన్నతోపాటు ఇతర పంటలపై ప్రభావం
- కీలక దశలో యూరియా లేక రైతన్నలు ఆగమాగం
- సొసైటీల వద్ద అర్ధరాత్రి నుంచే పడిగాపులు
- బస్తాల కోసం రోడ్డెక్కుతున్న అన్నదాతలు
- ప్రత్యామ్నాయ, కృత్రిమ ఎరువులనూ వాడొచ్చంటున్న శాస్త్రవేత్తలు

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

యూరియా కొరత కర్షకులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. అదను దాటుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రాణం పెట్టి సాగు చేస్తున్న పంట.. యూరియా లేక దెబ్బతింటోందని ఆవేదన చెందుతున్నారు. యూరియా కోసం నిద్రాహారాలు మరిచి అర్ధరాత్రి నుంచే బారులు తీరుతున్నారు. మరోవైపు వర్షాలు అన్నదాతను అతాలకుతలం చేస్తున్నాయి. పంటలపై ఇసుక మేటలు కప్పేసి రైతుల కలలను చిదిమేస్తున్నాయి. నీట మునిగిన వరి, పూత, కాత దశలో ఉన్న పత్తి వర్షాలతో క్షీణిస్తోంది. వర్షాల ధాటికి, ఎరువుల కొరతతో దెబ్బతిన్న కర్షకుల భవిష్యత్తు ఇప్పుడు అనిశ్చితంగా మారింది.

తెగుళ్లు.. ఇసుక మేటలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 6.14లక్షల ఎకరాల్లో వరి, 5లక్షల ఎకరాల్లో పత్తి, 3.20లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈసారి పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో యూరియాకు డిమాండ్ కూడా పెరిగింది. కొరతకు తోడు విస్తీర్ణం పెరగటంతో యూరియా కష్టాలు అధికమయ్యాయి. దీంతోపాటు అకాల వర్షాలు రైతులను ఆగమాగం చేస్తున్నాయి. రోళ్లు పగిలేలా ఎండలు ఉండాల్సిన రోహిణి కార్తెలో వాన చినుకులు ఊరించాయి. దీంతో తొందరపడి రైతులు పత్తి విత్తనాలు నాటారు. ఆ తరువాత రెండునెలలు వానల జాడలేకుండా పోయింది. దీంతో చాలామంది రైతులు పత్తి విత్తనాలను రెండు, మూడుసార్లు విత్తాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడి ఎకరాకు అదనంగా రూ.10వేల నుంచి రూ.15వేలకుపైగా పెరిగింది. ఈ క్రమంలో ఏపుగా పత్తి మొక్కలు పెరుగుతున్న క్రమంలో ఆగస్టు నెలలో మొదలైన వర్షాలు.. తీవ్ర నష్టాన్ని మిగుల్చుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చేలల్లో పత్తి మొక్కలకంటే గడ్డినే ఎక్కువ పెరుగుతుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. పైగా రోజుల తరబడి పత్తి చేలల్లో నీరు నిల్వ ఉండటంతో పత్తి మొక్కలు ఎర్రబారుతున్నాయి. ప్రస్తుతం గూడ దశలో పత్తి చేనులు ఉండగా, వర్షాలతో కాత, పూత నేలరాలి పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గూడ నేలరాలకుండా రైతులు అదనంగా మందులు పిచికారీ చేస్తున్నారు. వరి నాట్ల దశలో ఉండటంతో ఇసుక, బురద మేటలు వేయగా, కొన్నిచోట్ల పూర్తిగా వరిపొలాలు నీట మునిగాయి. రోజుల తరబడి నీటిలో ఉండటంతో వరినారు కుళ్లిపోతోంది. పత్తితోపాటు వరి పంటకు కూడా భారీ వర్షాలు (మిగతా 7వ పేజీలో)

యూరియా లేక పంటలు దెబ్బతింటున్నాయి..



పది ఎకరాల్లో పత్తి, రెండు ఎకరాల్లో వరి, మరో రెండు ఎకరాల్లో మిరప పంటలు సాగు చేశాను. పది రోజులుగా యూరియా కోసం ఎరువుల షాపులు చుట్టూ తిరుగుతున్నా.. వరి, పత్తి, మిరప పంటలకు యూరియా లేకపోవటంతో పంటల ఎదుగుదల, పచ్చదనం తగ్గుతోంది. పొద్దంతా యూరియా కోసం క్యూ ఉండాలంటే.. చేనులో పనిపోతోంది. వ్యవసాయంమే మాకు జీవనాధారం. పంటలకు సరిపడా యూరియాను ఇచ్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

\- పిట్టల రమేష్, రైతు, చిట్యాల, భూపాలపల్లి జిల్లా

ప్రత్యామ్నాయం వాడాలి



పంటలు బలంగా ఉండేందుకు నత్రజని అవసరం. యూరియాలో ఇది ఎక్కువగా లభిస్తుంది. ప్రస్తుతం యూరియా కొరత ఉన్న నేపథ్యంలో మార్కెట్లో నత్రజని కలిగిన అనేక ఫర్టిలైజర్స్ అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా నానో యూరియా, 19-19-19, 13-0-45 తదితర ఎరువులను యూరియాకు ప్రత్యామ్నాయంగా వాడవచ్చు. రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడటం కూడా పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒకేసారి కాకుండా శాస్త్రవేత్తల సూచన మేరకు వివిధ దశల్లో పంటలకు నత్రజనిని అందించాలి.

\- డాక్టర్ విశ్వతేజ, పంట విస్తరణ శాస్త్రవేత్త, వరంగల్ పరిశోధన కేంద్రం

శవ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ బీఆర్ఎస్

- పారిశుధ్య కార్మికుడి మృతిపై దుష్ప్రచారం తగదు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క
- మహేష్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత



పారిశుధ్య కార్మికుడు మహేష్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా మంజూరు పత్రాన్ని అందజేస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): శవ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ బీఆర్ఎస్ అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క వ్యాఖ్యానించారు. ములుగు మునిసిపల్ పారిశుధ్య కార్మికుడి మృతిపై దుష్ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకొనేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఈనెల 3న మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు ఫైదం మహేష్ కుటుంబాన్ని మంత్రి బుధవారం పరామర్శించారు. అతడి (మిగతా 8వ పేజీలో)

వాటర్ సంప్‌లో పడి ఆర్టిజన్ మృతి

- నైట్‌షిఫ్ట్‌లో ఉండగా ప్రమాదం
- కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులో దుర్ఘటన





సంప్‌లో సురేష్ మృతదేహం, సురేష్ (ఫైల్)

గణపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ)లో మంగళవారం ప్రమాదం చోటుచేసుకుంది. స్టేజ్-1లోని బాటమ్ యాష్ రికవరీ వాటర్ సంప్ వద్ద రాత్రి విధులకు హాజరైన ఆర్టిజన్ కార్మికుడు ప్రమాదవశాత్తు సంప్‌లో పడి మృతి చెందాడు. తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలం కొంపల్లికి చెందిన తూండ్ల సురేష్ (36) కేటీపీపీ భూ నిర్వాసితుడు. ప్రాజెక్టు నిర్మాణ దశలోనే కాంట్రాక్టు లేబర్‌గా జాయిన్ అయ్యాడు. 2017లో జెన్‌కోలో ఆర్టిజన్ గ్రేడ్-2 ఉద్యోగిగా పర్మనెంట్ అయ్యాడు. నైట్‌డ్యూటీలో భాగంగా స్టేజ్-1 (500మెగావాట్ల) బాటమ్ యాష్ రికవరీ సంప్ వద్దకు వాటర్ లెవల్ చెక్ చేయడానికి 8 గంటలకు వెళ్లాడు. సంప్ పరిమాణం 20ఫీట్ల వెడల్పు, 8నుంచి 10ఫీట్ల లోతుతో ఉంటుంది. దీని చుట్టూ నడవడానికి ట్రాక్ కూడా ఉంటుంది. వాటర్ లెవల్ చెక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు సురేష్ కాలుజారి సంప్‌లో పడిపోయాడు. ఈత రాకపోవడంతో అందులో మునిగి మృతిచెందాడు. ఉదయం విధులకు వెళ్లిన ఆర్టిజన్ కార్మికులు సంప్ వైపు వెళ్లి చూడగా అందులో సురేష్ విగత జీవిగా కనిపించాడు. ప్రాజెక్టు ఉన్నతాధికారులతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని వెలికితీసిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు వందపడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య జీవిత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



దేవేందర్ (ఫైల్)

మహాముత్తారం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాలీ వాహనం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న కావిటి దేవేందర్ (33) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి కలిగి ఈనెల 8న పురుగుల మందు తాగాడు. అతడిని భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందుతున్న క్రమంలోనే దేవేందర్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ కుమార్ తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌తో గొప్ప అవకాశం

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యో తి): కక్షిదారులు రాజీ పడేందుకు జాతీయ లోక్ అదాలత్ అనేది గొప్ప అవకాశమని భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపా రు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలిసీతెలియక చేసిన తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్ అదాలత్ సువర్ణావకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈనెల 13న నిర్వహించబో యే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, రాజీ మార్గ మే రాజ మార్గమని పేర్కొన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయాలు సాధిద్దాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీరనారి, తెలంగాణ సాయుధ యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని భూపాలపల్లి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఆమె విగ్రహం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐలమ్మ తెలంగాణ ప్రజల హక్కుల కోసం వీరోచితంగా పోరాడారని స్మరించుకున్నారు. భూస్వాముల అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో ఆమె పాత్ర కీలకమైందని అన్నారు. బహుజనుల ఆత్మ గౌరవం కోసం, మహిళల చైతన్యానికి ఐలమ్మ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు గాజర్ల అశోక్, నాయకులు పైడిపల్లి రమేష్, చెరుకుతోట శ్రీరాములు, శిరుప అనిల్, ముంజాల రవీందర్, జోగుల సమ్మయ్య, తిరుపతి, మురళీధర్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బుల కోసం వేధిస్తున్నాడని..

- కన్న కొడుకును అంతమొందించిన తండ్రి
- పెద్ద కుమారుడు, తమ్ముడితో కలిసి హత్య
- వెంకటాపూర్ మండలంలో ఘటన



నిందితుల అరెస్టును చూపిస్తున్న సీఐ సురేష్, ఎస్సై రాజు

వెంకటాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ములుగు వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన హత్య కేసును 48 గంటల్లో పోలీసులు ఛేదించారు. మృతుడి తండ్రి, సోదరుడు, సమీప బంధువుతోపాటు మరో వ్యక్తిని అరెస్టు చేసి ములుగు కోర్టులో హాజరుపరిచారు. ఎస్సై చల్ల రాజుతో కలిసి ములుగు సీఐ సురేష్ ఈ మేరకు బుధవారం వివరాలు వెల్లడించారు.

వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు దుర్గం సూరయ్య ములుగులో నివాసం ఉంటున్నాడు. సూరయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయనకున్న నాలుగెకరాల భూమిని ముగ్గురికి సమానంగా పంచాడు. చిన్న కుమారుడు అశోక్ మద్యానికి బానిసై ఆన్‌లైన్ బెట్టింగులు, జూదానికి అలవాటు పడ్డాడు. దీంతో డబ్బులు వృథాచేసి అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో తన వాటాగా సంక్రమించిన భూమిని కూడా అశోక్ విక్రయించాడు. ఆపై తల్లిదండ్రులను బెదిరించి డబ్బులు తీసుకెళ్లేవాడు. ఈ విషయంలో పలుమార్లు పెద్ద అన్న సంపత్, బాబాయి సాంబయ్య మధ్యవర్తిత్వం వహించారు. అయినా అశోక్‌లో మార్పు (మిగతా 8వ పేజీలో)

ఇట్లుంటే ఎట్లా..?!

- అస్తవ్యస్తంగా విద్యా వ్యవస్థ
- ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల తిష్ట
- జిల్లాలో ఇంకా ఖాళీగానే ఉపాధ్యాయ పోస్టులు
- మూతబడిన 34 బడులు

వివరాలు 6లో..



దీఈవో సిద్ధార్థరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఏజెన్సీ విద్యావ్యవస్థపై దృష్టి సారించాలని వినతి

వెంకటాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ విద్యా వ్యవస్థపై దృష్టి సారించాలని కోరుతూ ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో నాయకులు ములుగులో జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి మాట్లాడుతూ వెంకటాపురం, వాజేడు మండలాల్లో విద్యా వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని అన్నారు. విద్యార్థులు వందలసంఖ్యలో ఉంటే ఉపాధ్యాయులు మాత్రం ఒక్కరే ఉంటున్నారని, విద్యాహక్కు చట్టం ప్రకారం 11మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలన్నారు. అదేవిధంగా ఏకోఉపాధ్యాయ పాఠశాలలు కేవలం కేర్‌టేకింగ్ స్కూళ్లలోనే నడుస్తున్నాయని, విద్యాబోధన సక్రమంగా సాగడంలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏజెన్సీ విద్యా వ్యవస్థపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాయం అజయ్, ఉయిక మహేష్, బొగ్గుల నారాయణ, పాయం నర్సింహరావు, శ్యామల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో వేలానికి విశేష స్పందన

వెంకటాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో లడ్డూ, పులిహోర అమ్ముకునేందుకు నిర్వహించిన వేలంపాటకు విశేష స్పందన లభించింది. బుధవారం ఉదయం దేవాలయ అధికారి కె.వెంకటయ్య పర్యవేక్షణలో పాటదారుల సమక్షంలో లడ్డూ, పులిహోర అమ్ముకునే హక్కు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. ఈవేలంపాటలో కరీంనగర్ జిల్లా జమ్మికుంట సైదాబాద్‌కు చెందిన గోలి కుమారస్వామి 2025-26 సంవత్సరానికి రూ.7.92లక్షలకు పాట దక్కించుకున్నారు. గత ఏడాదికంటే రూ.3.81లక్షల ఆదాయం ఎక్కువగా వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రామప్ప దేవాలయ కార్యనిర్వహణ అధికారి బిల్ల శ్రీనివాస్, అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్, సిబ్బంది అవినాష్, సంతోష్, పురావస్తుశాఖ, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మోడల్ విద్యార్థినులు

గోవిందరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ములుగులో నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో మండలంలోని చల్వాయి మోడల్‌స్కూల్ విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గండు కుమార్ బుధవారం తెలిపారు. జి.లాస్య, సీహెచ్.నిత్యశ్రీలు స్టోరీటెల్లింగ్ కాంపిటీషన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని అన్నారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడిగా రవి

వెంకటాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంస్కృతిక సారథి ములుగు జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడిగా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన మార్త రవి ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షుడిగా కనకం రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా రాగుల శంకర్, సహాయ కార్యదర్శిగా రేలా విజయ్, కోశాధికారిగా అమ్మపాట తిరుపతి, సభ్యులుగా రహీమొద్దీన్, బోడ కిషన్, నరేష్, భాస్కర్, రాములు ఎన్నికయ్యారు.

రైతుకు తీవ్ర గాయాలు

మరిపెడ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఓ రైతు యూరియా కొరకు వెళ్తుండగా మార్గమధ్యంలో తన ద్విచక్రవాహనం బొల్తా కొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెం వద్ద బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. భూక్యా తండా గ్రామ పంచాయతీకి చెందిన భూక్యా నర్సింగ్ తన ద్విచక్రవాహనంపై బుధవారం తెల్లవారు జామున యూరియా ఎక్కడ ఇస్తున్నారో అని తెలుసుకుని క్యూలో నిల్చేందుకు మండల కేంద్రానికి బయలు దేరాడు. మార్గమధ్యలోని పురుషోత్తమాయగూడెం శివారు వద్ద తన బైక్ బొల్తా కొట్టింది. దీంతో నర్సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో నర్సింగ్‌ను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.



తీవ్రగాయాలైన భూక్యా నర్సింగ్

ఇట్లుంటే ఎట్లా..?!

● అస్తవ్యస్తంగా జిల్లా విద్యా వ్యవస్థ ● ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల తిష్ట ● ప్రభుత్వాలు మారినా.. మారని తీరు
● ఇంకా ఖాళీగానే ఉపాధ్యాయ పోస్టులు ● పూర్తికాని ప్రీప్రైమరీ నియామకాలు ● మూతబడిన 34 బడులు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు ఉంది విద్యా వ్యవస్థ పరిస్థితి. జిల్లాలోని సర్కారు పాఠశాలల సమస్యలు సంవత్సరాల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా వాటి తలరాత మారడం లేదు. ఇప్పటి వరకు చాలా చోట్లా ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇటీవల విడుదలైన ప్రీ ప్రైమరీ పోస్టులను సైతం ఇంకా భర్తీ చేయలేదు. అనేక పాఠశాలల్లో తరగతి గదుల నుంచి మొదలుకొని మరుగుదొడ్ల దాకా.. అన్నీ అధ్వానంగానే ఉంటున్నాయని తెలుస్తోంది. దీంతో అవస్థల నడుమ విద్యార్థులు తమ చదువులు కొనసాగిస్తున్నారు. చాలా చోట్ల పాఠశాలల్లో భవనాలు, నీరు, విద్యుత్ సౌకర్యాలు లేవు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 319 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 44 ప్రాథమికోన్నత పాఠశాలలు, 69 ఉన్నత పాఠశాలలున్నాయి. మొత్తం 285 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 15వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే కస్తూర్బాగాంధీ విద్యాలయాలు 11, మోడల్ స్కూల్స్ 6, మైనారిటీ స్కూల్ ఒకటి, అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్ ఒకటి, ఎస్సీ హాస్టళ్లు 11, ఎస్సీ రెసిడెన్సియల్స్ రెండు, బీసీ హాస్టల్స్ ఐదు, బీసీ రెసిడెన్సియల్స్ రెండు, ఎస్సీ గురుకులాలు ఏడు, హాస్టల్స్ రెండు.. మొత్తం 48 ఉండగా వీటిలో సుమారు 10, 453 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

34 పాఠశాలల మూసివేత

జిల్లాలోని 12 మండలాల్లో 34 పాఠశాలలు మూసివేతకు గురయ్యాయి. అక్కడ విద్యార్థులు లేకపోవడమే ఇందుకు కారణమని ఉపాధ్యాయులు అంటున్నారు. అయితే.. ఆ పాఠశాలల ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరు కాకపోవడమే పాఠశాలల మూసివేతకు కారణమని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. వంతుల వారీగా ఉపాధ్యాయులు డ్యూటీలు చేయడం, తరచూ గైర్హాజరు కావడం వల్ల తరగతులు సరిగా నడవక విద్యార్థులు రావడం లేదని స్థానికులు అంటున్నారు. ఆయా పాఠశాలలు నిర్లక్ష్యానికి గురికావడం వల్లే అవి మూతపడ్డాయని చెబుతున్నారు. దీంతో చేసేదేమీ లేక తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నామని పలువురు తల్లిదండ్రులు అంటున్నారు. మూతపడిన పాఠశాలల్లో భూపాలపల్లి పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాల, చిట్యాలలోని వరికోల్‌పల్లి పీఎస్, గణపురంలోని కొండంపల్లి పీఎస్, కాటారంలోని ధర్మసాగర్ పీఎస్, గోరికొత్తపల్లిలోని బాలయ్యపల్లి పీఎస్, మహదేవపూర్‌లోని మేడిగడ్డ, మల్హర్‌లోని కేశరాంపల్లి, మొగుళ్లపల్లిలోని వాగొడ్డుపల్లి, మహాముత్తారం పర్లపల్లి, టేకుమట్లలోని బూర్నపల్లి పీఎస్‌లు సహా మొత్తం 34 పాఠశాలలు ఉన్నాయి.

47 ప్రమోషన్లతో పీఎస్‌లలో ఖాళీలు

జిల్లాలో 47 మంది ఎస్‌జీటీలకు ఇటీవల స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు వచ్చాయి. ఇది జరిగి రెండు నెలలు కావస్తున్నా ఇంకా ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయలేదు. వీరి స్థానంలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాల్సి ఉండేది. కానీ ఇంకా ఆ నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు నష్టపోయే దుస్థితి నెలకొంది.

పూర్తికాని ప్రైమరీ పోస్టుల భర్తీ

ఇటీవల పలు పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయగా జిల్లాలోని 55 పాఠశాలలకు మొత్తంగా 1,200 దరఖాస్తులు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. ఓ వైపు వార్షిక పరీక్షలు సమీపిస్తుండగా మరోవైపు సిలబస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అయినా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండటం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జిల్లాలో 1,567 మంది ఉపాధ్యాయులు ఉండగా ఇంకా 252 ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది.

భవనాలు, కరెంటు సౌకర్యం లేక..

కాటారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మండల ప్రజా పరిషత్ పాఠశాల ఉంది. ఇందులో సుమారు 28 మంది విద్యార్థులు ఉంటారు. పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని కూల్చివేశారు. దాని స్థానంలో నూతన భవనానికి గత సంవత్సరం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు పిల్లర్ల వరకే పరిమితమైంది. దీనిపై ఎందుకింత నిర్లక్ష్యం అంటూ ఆ కాలనీవాసులు మండిపడుతున్నారు. ఈ పాఠశాలను ప్రస్తుతం ఓ అద్దె భవనంలో కొనసాగుతోంది. అలాగే మొగుళ్లపల్లి మండలంలోని అప్పాజీపేట పీఎస్ భవనం కూలిపోయే దశలో ఉండటంతో దీనిని ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రంలో నడుపుతున్నారు. అలాగే జిల్లాలో విద్యుత్ సౌకర్యం లేని పాఠశాలలు కూడా ఉండటం విస్మయం కలిగిస్తోంది. అందులో టేకుమట్ల మండలంలోని జోడుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఒకటి. ఇప్పటి వరకు ఈ పాఠశాలకు విద్యుత్ సౌకర్యం లేదు. అధునాతన కాలంలో కూడా అంధకారంలో పాఠశాలలు మగ్గుతుండటంపై గ్రామస్థులు ముక్కున వేలువేసుకుంటున్నారు.

మరుగుదొడ్లు ఉన్నా లేనట్లే..

జిల్లాలోని సుమారు 37 పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నా అవి నిరుపయోగంగా ఉంటున్నాయని తెలుస్తోంది. జంగేడులోని ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు ఉన్నా అవి పనిచేయడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే 47 పాఠశాలల్లో మరుగుదొడ్లు అసలుకే లేవని తెలుస్తోంది. మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లిలోని జడ్పీహెచ్‌ఎస్‌లో మరుగుదొడ్డి లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 403 పాఠశాలలకు స్కావెంజర్లు నియమించడంతో వాటి ఆవరణ ప్రస్తుతం పరిశుభ్రంగా ఉంటోందని తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి సమస్యలను పరిష్కారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కాటారంలోని ఎస్సీ కాలనీలో పిల్లర్లకే పరిమితమైన పాఠశాల భవనం

సొంతింటి కలను సాకారం చేస్తున్నాం

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

ములుగు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేరు పేదల సొంతింటి కలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తోందని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు మండలం మదనపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆమె బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పునాది తవ్వారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్హులైన నిరుపేదలందరికీ ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు ఇందిరమ్మ పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 6 వేల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవి చందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మాజీ సర్పంచ్ పోరిక బాబురావు, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు ఎం.డి. చాంద్ పాషా పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి సీతక్క

నాణ్యమైన విద్యనందించాలి

అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అడిషనల్ కలెక్టర్, అధికారులు

కాటారం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):గురుకులంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యను అందించాలని ప్రిన్సిపాల్, వార్డెన్లను భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి ఆదేశించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకులాన్ని ఆమె బుధవారం సందర్శించి తనిఖీ చేశారు. గురుకులం పరిసరాలు, మౌళిక వసతులను పరిశీలించారు. రికార్డులను, వంట సరుకులను, భోజనం తయారీని తనిఖీ చేసి విద్యార్థినిలతో కలిసి అడిషనల్ కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అడ్డూరి బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సమీర్‌ఖాన్, అధ్యాపకులు, విద్యార్థినిలు తదితరులు ఉన్నారు.

ఐటీ సెక్టార్‌గా ములుగు జిల్లా

● వడివడిగా పడుతున్న అడుగులు
● అటవీ ప్రాంతం నుంచి దినదినాభివృద్ధి

ములుగు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఐటీ సెక్టార్‌గా ఆవిర్భవించనుందని తెలుస్తోంది. సాంకేతికంగా అభివృద్ధి చెందేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. గిరిజన, ఆదివాసీ ప్రజలు అత్యధికంగా జీవించే ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా పురోగతి వైపు సాగుతోందని తెలుస్తోంది. ఇందుకు మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఐటీ సెక్టార్‌లో భాగంగా ములుగు పట్టణ శివారులో అత్యాధునిక హంగులతో భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో వరంగల్, హనుమకొండ, హైదరాబాద్ వంటి ప్రధాన పట్టణాలకు పరిమితమైన ఐటీ కంపెనీలు ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లాకు రానున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని టాస్క్ సెంటర్ ద్వారా స్రియ ఇన్ఫోటెక్ కంపెనీ నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి 51 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. సుమారు రెండెకరాల్లో రూ. 6కోట్ల నిధులతో త్వరలో ఏర్పాటు చేయనున్న ఐదంతస్తుల ఐటీ టవర్ పూర్తయితే జిల్లాకు మరో ఐదు ఐటీ కంపెనీలు వచ్చే అవకాశం ఉంది.

దీంతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దండిగా లభించనున్నాయి. ఉద్యోగాల కోసం ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఇక ఉండదు. తద్వారా జిల్లా ఆర్థిక వ్యవస్థ బలోపేతం కానుంది. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరగా పేరొందిన సమ్మక్క-సారలమ్మ మహా జాతరతోపాటు, లక్నవరం, బొగత వంటి అనేక పర్యాటక ప్రాంతాలతో ప్రసిద్ధి చెందిన ములుగు జిల్లా ఐటీ రంగంలోనూ తనదైన స్థానాన్ని సంపాదించుకోనుంది.

ఆర్టీసీ బస్సు ఆపే విషయంలో.. డ్రైవర్, ప్రయాణికురాలి నడుమ ఘర్షణ

● పోలీసులను ఆశ్రయించిన ఇరువురు

బయ్యారం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఆపే విషయంలో డ్రైవర్, ప్రయాణికురాలు నడు మ ఘర్షణ చోటు చేసుకోగా, ఇరువురు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన బుధవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.

మహబూబాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం మహబూబాబాద్ బస్టాండ్ నుంచి ఇల్లెందు వెళ్తుంది. ఈ క్రమంలోనే ఓ ప్రయాణికురాలు బస్సు ఎక్కేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. దీంతో ఆ ప్రయాణికురాలు భర్త ద్విచక్ర వాహనంపై వెనకాల వస్తూ బయ్యారం వరకు బస్సును వెంబడించాడు. బయ్యారం మెయిన్ రోడ్డుపై బస్సును క్యాచ్ చేసిన క్రమంలో ఇరువురి నడుమ ఘర్షణ చోటు చేసుకుంది. చెయ్యెత్తి బస్సు ఆపమన్నా ఎందుకు ఆపలేదంటూ ప్రయాణికురాలు.. సరిగ్గా చెయ్యి లేపకపోవడంతో పాటు స్టేజీ కాని చోట బస్సు ఎలా ఆపుతారంటూ డ్రైవర్.. ఇలా కాసేపు వారి ఇరువురి నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం డ్రైవర్ ఆ ప్రయాణికురాలిని బస్సులో ఎక్కించుకొని ఇల్లెందు బయలు దేరాడు. అనంతరం ఘటనకు సంబంధించి ఇరు వర్గీయులు స్థానిక పోలీసులను ఆశ్రయించి, ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా ఇరు వర్గీయుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు కేసు విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రజకులకు 10 అసెంబ్లీ సీట్లు ఇవ్వాలి

● మోకాళ్లపై నడిచిన యువకుడు



మోకాళ్లపై నడుస్తున్న సతీష్

కేసముద్రం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రజకులకు అసెంబ్లీలో పది సీట్లు ఇవ్వాలని కోరుతూ వినూత్నరీతిలో బుధవారం కేసముద్రం పోలీస్‌స్టేషన్ నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు మోకాళ్లపై స్థానిక యువకుడు వి.సతీష్ నడిచారు. ఫ్లకార్డు పట్టుకొని చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కులానికి ఎన్నికల్లో ప్రాధాన్యతనివ్వాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కాటారం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని విలాసాగర్ మానేరు నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీనివాస్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను జిల్లా కేంద్రానికి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు మేడిపల్లి శివారులో పట్టుకుని సీజ్ చేసి అలీం, దినకర్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలి

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ, టీపీటీఎఫ్, డీటీఎఫ్, టీఆర్‌టీఎఫ్, టీటీయూ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా సంఘాల నాయకులు బుధవారం వారు డీఈవో రాజేందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు రమేష్‌నాయక్, సేవానాయక్, జగపతిరావు, అశోక్, తిరుపతి, మధుసూదన్, రవీందర్, రఘువీర్, గోపీనాయక్ మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ కార్యాలయంతో పాటు ఇటీవల వర్క్ అడ్జెట్‌మెంట్ పేరుతో అక్రమ డిప్యూటేషన్ల ప్రక్రియను చేపట్టినట్లు ఆరోపించారు. విద్యాశాఖ డైరెక్టరేట్ మార్గదర్శకాలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా డీఈవో నియామకాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అయితే డీఈవో కార్యాలయంలో ఇప్పటికే సీఎంవో, ఏఎంవో, జీసీడీవో, డీసీఈబీ, డిప్యూటీ సెక్రటరీతో పాటు ఏసీజీఈ, అసిస్టెంట్ సెక్రటరీలను నియమించినట్లు తెలిపారు. ఈ పోస్టులలో నియమించాలంటే.. సర్వశిక్షా అభియాన్ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అదికూడా మూడు సంవత్సరాల వరకు మాత్రమే పరిమితి ఉంటుందని తెలిపారు. కానీ వీరు అక్రమంగా నియామకం కావడమే కాకుండా నాలుగు సంవత్సరాల నుంచి కొనసాగుతున్నారని అన్నారు. యూపీఎస్ కొండంపేట నుంచి ఒక టీచర్‌ను కాటారం మండలం మేడిపల్లి ఎంపీపీఎస్‌కు వర్క్ అడ్జెస్ట్ మెంట్ చేశారని, మేడిపల్లి నుంచి మల్హర్‌కు మరో టీచర్‌ను చేశారని ఇలా ఇష్టాంవచ్చినట్లు చేసినట్లు ఆరోపించారు. ఇటీవల కేజీబీవీలలో ఖాళీలను భర్తీ చేసే విషయంలో రహస్యంగా నింపారని తెలిపారు. టీఎల్‌ఎం మేళా ఎంపికలో కూడా పక్షపాత వైఖరి చూపారని విమర్శలు చేశారు. కాగా వెంటనే వీటిని సవరించాలని, డీఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడ తామని హెచ్చరించారు.

ఎల్లారెడ్డిపల్లి అడవిలో పెద్దపులి!

వెంకటాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో వారం రోజులుగా పెద్దపులి సంచారం కలవరానికి గురిచేస్తోంది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పాకాల అటవీ ప్రాంతం నుంచి ములుగు మండలం పత్తిపల్లి మీదుగా వెంకటాపూర్ మండలంలోని సింగరకుంటపల్లి, పాపయ్యపల్లికి చేరుకున్న పెద్దపులి రామప్ప సరస్సులో ఈత కొట్టినట్లు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు. అక్కడి నుంచి వానరగుట్టలోకి వెళ్లినట్లు అనుమానించారు. గుట్ట నుంచి పులి గాండ్రిపులు వినబడినట్లు చెంచుపల్లి గ్రామస్థులు తెలిపారు. పులి ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులు వారం రోజులుగా గాలిస్తున్నారు. ఇదే క్రమంలో మండలంలోని ఎల్లారెడ్డిపల్లి అటవీప్రాంతంలో పులి పాదముద్రలను స్థానిక గోవులకాపరి చంద్రశేఖర్ బుధవారం గుర్తించాడని తెలుస్తోంది. అయితే.. స్థానికులు పులి సంచారాన్ని గుర్తించి సమాచారం ఇచ్చినా అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రాత్రివేళల్లో పంట పొలాల వద్దకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పశువుల కాపరులు సైతం భయం గుప్పిట్లో ఉంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అటవీ శాఖ ఉన్నతాధికారులు పులిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

హత్యను ఛేదించిన పోలీసులు

48గంటల్లో నిందితుల అరెస్టు

వెంకటాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన హత్యకేసును 48గంటల్లో పోలీసులు ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్టుచేసి బుధవారం ములుగు కోర్టులో హాజరుపరిచారు. ములుగు సీఐ సురేష్ ఎస్సై చల్ల రాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు దుర్గం సూరయ్య ములుగులో నివాసం ఉంటున్నాడు. సూరయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయనకున్న నాలుగెకరాల భూమిని ముగ్గురికి సమానంగా పంచాడు. చిన్న కుమారుడు అశోక్ మద్యానికి బానిసై ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, జూదంతో డబ్బులు వృథాచేసి అప్పులపాలైనట్లు సీఐ వెల్లడించారు. తన వాటాగా సంక్రమించిన భూమిని కూడా అశోక్ విక్రయించాడు. తల్లిదండ్రులను బెదిరిస్తూ డబ్బులు తీసుకెళ్లేవాడు. తన సోదరుడు దుర్గం సంపత్, సూరయ్య చిన్న తమ్ముడు సాంబయ్యలు అనేకసార్లు మధ్యవర్తిత్వం చేసినా అశోక్ పరిస్థితిలో మార్పురాలేదు.

దీంతో సూరయ్య పెద్దకుమారుడు సంపత్, చిన్న తమ్ముడు సాంబయ్యలు కలిసి అశోక్ మళ్లీ గొడవ చేస్తే చంపాలని ఓ నిర్ణయానికి వచ్చారు. యథావిధిగా ఈనెల 7వతేదీ సాయంత్రం అశోక్ మద్యంమత్తులో ఇంటికి వచ్చి తండ్రిని చంపేస్తానని బెదిరింపులకు దిగాడు. ఈ సమయంలో సాంబయ్య తాడుతో అశోక్ మెడకు చుట్టి గుంజగా సూరయ్య కాళ్లను పట్టుకోగా, సంపత్ తాడును బిగించి హతమార్చారు. అనంతరం మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని డ్రైవర్ తీగల రమేష్ సహాయంతో లక్ష్మీదేవిపేటకు తీసుకెళ్లి ఇంటి రేకులషెడ్డు కింద బల్లపై వేసి ఏమీ తెలియనట్లు తిరిగి ములుగు చేరుకున్నారు. కేసు విచారణలో పోలీసులకు అనుమానం రావడంతో నిందితుల కోసం వెతుకుతుండగా ఓ కాంగ్రెస్ నాయకుడి ద్వారా నలుగురు నిందితులు ములుగు సీఐ ఎదుట లొంగిపోయారు. దుర్గం సంపత్, దుర్గం సాంబయ్య, దుర్గం సూరయ్య, డ్రైవర్ తీగల రమేస్‌లను అరెస్టు చేసి ములుగు కోర్టులో హాజరుపరిచారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం, తాడును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7555	5300
మక్కలు	2211	1521
కందులు	5859	3022
పెసళ్లు	6507	3022
పల్లికాయ (సూక)	5800	3500
పల్లికాయ (పచ్చిది)	3900	2400
పసుపు (కాడి)	10359	7889
పసుపు (గోల)	9859	8996
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16200	12000
యూఎస్341ఏసీ	14500	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం


పాకాలలో దెబ్బతిన్న హరిత కాటేజీలు


పాకాలలో మూసివేసిన హరిత రెస్టారెంట్

కళా విహీనం.. కాటేజీలు

- పూర్తిగా దెబ్బతిన్న 5 కుటీరాలు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు
- అందుబాటులోకి తీసుకు రావాలంటున్న పర్యాటకులు

ఖానాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చుట్టూ దట్టమైన అడవులు, ఎత్తైన వృక్షాలు, సెలయేటి సవ్వడులు, పక్షులు కిలకిల రాగాలకు పెట్టిందిపేరు పాకాల. నిత్యం జిల్లా నలుమూలలతో పాటు దేశ విదేశాల నుంచి పాకాల అందాలను వీక్షించడానికి వందలాది మంది పర్యాటకులు విచ్చేసి పాకాల ఒడిలో సేదతీరుతుంటారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే గొప్ప పర్యాటక ప్రదేశమైన పాకాలలో పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన హరిత కాటేజీలు కొంత కాలంగా నిరుపయోగంగా మారాయి. ఎంతో మంది పర్యాటకులకు ఆశ్రయమిచ్చిన కాటేజీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరమ్మతులకు నోచుకోకపోవడంతో టూరిజం అధికారులు సేవలను నిలిపివేశారు.

దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు పాకాలలో విడిదిచేసే భాగ్యం లేకుండాపోయింది. పాకాలకు వచ్చే పర్యాటకుల కోసం బస చేయడానికి 2017లో అప్పటి ప్రభుత్వం పర్యాటక శాఖకు సంబంధించిన నిధులు కోట్లాది రూపాయల వెచ్చించింది. అధునాతన పద్ధతిలో 7కాటేజీల నిర్మాణం చేపట్టి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. అందులో 4 టెంటెడ్ అకామిడేషన్ కాటేజీలు కాగా, మరో 3 గ్లాసెస్ అకామిడేషన్‌తో నిర్మాణం చేపట్టింది. దీంతో పాకాలకు విచ్చేసే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. పాకాల కాటేజీల్లో బస చేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుండడంతో వారికి భోజన వసతి సౌకర్యం కల్పించేందుకు పర్యాటకశాఖ హరిత రెస్టారెంట్, పాకాల సరస్సులో బోటింగ్‌నూ ప్రారంభించింది. దీంతో పర్యాటక శాఖకు ఆదాయం పెరిగింది.

కరోనాతో మొదలైన కష్టాలు

2020లో వచ్చిన కరోనాతో పాకాల టూరిజానికి కష్టాలు ప్రారంభమయ్యాయి. కరోనాతో హరిత కాటేజీలను, రెస్టారెంట్‌ను, బోటింగ్‌ను మూసివేశారు. కానీ, కరోనా అనంతరం రెస్టారెంట్, బోటింగ్ తిరిగి ప్రారంభించబడలేదు. దీంతో కొంతమంది సిబ్బందిని సైతం తొలగించారు. 2017లో నిర్మాణమైన హరిత కాటేజీలు కొద్ది సంవత్సరాలు ఎలాంటి మరమ్మతులు లేకుండా పర్యాటకులకు అందుబాటులో ఉన్నాయి. కాలం గడిచే కొద్ది కాటేజీలు క్రమేణా దెబ్బతిన్నాయి. గత 2 సంవత్సరాలుగా కాటేజీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గ్లాసెస్ కాటేజీల రూఫ్ లెవల్ పూర్తిగా దెబ్బతింది. వర్షం వస్తే కురుస్తున్నది. లోపల ఫర్నిచర్ సైతం ధ్వంసమైంది. దీంతో పర్యాటకులు రాలేని పరిస్థితి దాపురించింది. దీంతో కొద్ది నెలల క్రితం పర్యాటక శాఖ కాటేజీలను ఆన్‌లైన్ నుంచి తొలగించింది. ఇప్పటి వరకు 3 గ్లాసెస్, 2 టెంటెడ్ కాటేజీలను పూర్తిగా మూసివేశారు. మరో 2 టెంటెడ్ కాటేజీలను అవసరానికి మాత్రమే వాడుకుంటున్నారు. 7 కాటేజీలు ఉపయోగంలో ఉన్నప్పుడు నెలకు ఆదాయం రూ1.50లక్షలకు పైగానే ఉండేది. ప్రస్తుతం నెలకు రూ.25 వేలలోపు మాత్రమే వస్తున్నదని అదేవిధంగా రెస్టారెంట్ నడిచినప్పుడు ఆదాయం నెలకు రూ.50వేలకు పైగా ఉండేదని, బోటింగ్ ఆదాయం సైతం నెలకు రూ.1.50 లక్షల వరకు ఉండేదని టూరిజం అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రెస్టారెంట్ మూసివేయడం, బోటింగ్‌ను అటవీశాఖకు ఇచ్చారు. దీంతో ఆధాయం గణనీయంగా తగ్గిపోయింది.

కాటేజీలు దెబ్బతినడంతో మరమ్మతులు చేపట్టడానికి 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అది ఆచరణలో కార్యరూపం దాల్చలేదు. రెండు నెలల కిందట టూరిజం అధికారులు పాకాల కాటేజీలను పరిశీలించారు. కాటేజీల సేవలు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో 2 కాటేజీల సేవలను తిరిగి ఆన్‌లైన్‌లో చేర్చారు. అలాగే దెబ్బతిన్న కాటేజీల మరమ్మతులకు రూ.30లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపించారు. దీనికి తోడు పాకాలలో మరో 4 నూతన కాటేజీల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్న

ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం

ట్లు అధికారుల ద్వారా తెలిసింది. కానీ, ఇప్పటివరకు స్పష్టత లేదు. ఇప్పటివరకు మరమ్మతులు, నూతన కాటేజీల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. కాటేజీల ఆదాయం పడిపోవడంతో అందులో విధులు నిర్వర్తించే సిబ్బందికి కావాల్సిన జీతాలు కూడా వెళ్లలేని పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా పాకాలలో పర్యాటక అభివృద్ధికి సంబంధిత శాఖ మంత్రి, కలెక్టర్ తక్షణమే స్పందించి దెబ్బతిన్న కాటేజీల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి, వాటిని ఆధునీకరించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా స్పీడ్ బోట్

పాకాల సరస్సులో స్పీడ్ బోటు సేవలు నిలిచిపోయాయి. స్పీడ్ బోట్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు. పర్యాటక ప్రదేశమైన పాకాల అందాలను వీక్షించడానికి వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది పర్యాటకులు వస్తుంటారు. పాకాల అందాలతో పాటు సరస్సులో బోటు షికారు చేయాలని కోరుకుంటారు. కానీ కొన్నేళ్లుగా పాకాలలో బోటింగ్ సేవలు నిలిచిపోవడంతో పర్యాటకులు అసంతృప్తికి గురవుతున్నారు. గత వేసవిలో అటవీ శాఖాధికారులు పాకాలలో బోటింగ్ సేవలను పునరుద్ధరించి డీలక్స్, స్పీడ్ బోట్లను ఏర్పాటు చేశారు. డీలక్స్ బోట్‌లో సామర్థ్యం 19 మంది కాగా, స్పీడ్ బోట్‌లో 4గురు విహరించవచ్చు. అయితే బోటింగ్ సేవలను పునరుద్ధరించిన నాటి నుంచి స్పీడ్‌బోట్ సేవలను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురాలేదు. పాకాల సరస్సులోనే తాళ్లతో కట్టివేసి అలంకారప్రాయంగా ఉంచారు. దీంతో స్పీడ్ బోట్‌లో షికారు చేయాలనుకునే పర్యాటకులు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా పర్యాటకుల కోసం స్పీడ్‌బోటు సేవలను అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.


పాకాల సరస్సులో తాళ్లతో కట్టి వేసిన స్పీడ్ బోట్

ప్రచారం లేక.. పథకం గురించి తెలియక..

నీరుగారుతున్న ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకం

- నామమాత్రంగా దరఖాస్తుల దాఖలు
- నాలుగేళ్లలో ఉమ్మడి జిల్లాలో 1,201 దరఖాస్తులే..
- రూ.20 వేల సాయం పొందలేక పోతున్న నిరుపేదలు

హనుమకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) గురించి ప్రజల్లో ప్రచారం కొరవడింది. ఈ పథకం గురించి చాలా మందికి తెలియక దరఖాస్తులు పెద్దగా చేసుకోవడం లేదు. స్థానిక పాలనా యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఈ పథకానికి విస్తృత ప్రచారం కల్పించాల్సి ఉండగా, అధికారులు పట్టించుకోవడం లేదు. దీనితో ఈపథకం ద్వారా నిరుపేదలు ప్రయోజనం పొందకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది.

కుటుంబ పెద్ద మరణిస్తే..

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాన్ని పోషించే వ్యక్తి ఆకస్మికంగానీ, లేదా ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి ఒకింత సాయంగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ప్రవేశపెట్టింది. పథకం ఉద్దేశం బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో పేద ప్రజల దరిచేరడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన లేకపోవడం, అధికారుల పట్టింపు లేని కారణంగా ప్రజలు దరఖాస్తు చేయడం లేదు.



మార్గదర్శకాలు

ఎన్ఎఫ్‌బీఎస్ పథకం గురించి ప్రజలకు తెలియచేయడానికి నిర్వహించాల్సిన ప్రచార కార్యక్రమంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ పథకంపై విస్తృత ప్రచారం కల్పించడానికి ప్రభుత్వ బహుళ మార్గాలను (మల్టీ మోడల్) అనుసరించాలని, రేడియో, టెలివిజన్, స్థానిక వార్తా పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం, గ్రామ సభల్లో, పంచాయతీ సమావేశాల్లో ఈ పథకం గురించి పదే పదే వివరించడం, క్షేత్రస్థాయి సిబ్బంది, ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు, ప్రజలకు స్వయంగా చేరువై దరఖాస్తు ప్రక్రియలో సహాయం అందించడం, బ్యాంకులు సైతం తమ గ్రామీణ శాఖల్లో ఈ పథకానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు ప్రదర్శించడం, ఖాతారులకు అవగాహన కల్పించడం వంటివి చేయాలని అందులో పేర్కొన్నది. కానీ జిల్లా యంత్రాంగాలు ఇవేవి చేయడం లేదు. గ్రామ, మండల స్థాయి అధికారులు అసలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఈ పథకం కింద ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదంటే ప్రచారం ఎలా జరుగుతుందో స్పష్టమవుతోంది.

రూ.20 వేల సాయం

కుటుంబ యజమాని చనిపోతే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద రూ. 20,000 ఆర్థిక సాయాన్ని కేంద్రం అందజేస్తుంది. తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, కులం, ఆదాయం, కుటుంబ సభ్యుల ధ్రువపత్రం, బ్యాంకు ఖాతా పత్రాలతో ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులలు స్వీకరిస్తారు. మరణించిన వ్యక్తి 18-60 ఏళ్ల మధ్య ఉండాలి. మృతి చెందినప్పటి నుంచి రెండేళ్ల వరకు ఎప్పుడైనా ఈ పథకానికి దరఖాస్తులు సమర్పించుకునే అవకాశం ఉంది. ఆర్థిక సహాయం సాధారణంగా కుటుంబంలోని వితంతువుకు లేదా అవివాహిత కుమార్తెకు లభిస్తుంది. దరఖాస్తులను గ్రామ, మండల స్థాయిలో సంబంధిత పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలి. ఆమోదం పొందిన తర్వాత సహాయం కోసం ప్రభుత్వం అధికారిక వెబ్‌సైట్‌లో సమాచారం నమోదవుతుంది.

నాలుగేళ్లలో 1,201 దరఖాస్తులే..


ఉమ్మడి జిల్లాలో 75 మండలాల్లో 1,705 పంచాయతీలు ఉన్నాయి. ఏటా నిరుపేద కుటుంబాలకు చెందిన యజమానులు వందల సంఖ్యలో వివిధ కారణాలతో మృతి చెందుతూనే ఉన్నారు. వారి నుంచి ఎలాంటి దరఖాస్తులు రావడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2021 సంవత్సరం నుంచి 2025 జులై 31 వరకు 1,201 దరఖాస్తులు వచ్చాయి. వరంగల్ జిల్లాలో 267, హనుమకొండ జిల్లాలో 290, జనగామ జిల్లాలో 250, మహబూబాబాద్ జిల్లాలో 185, ములుగు జిల్లాలో 99, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 110 వచ్చాయి. వీటిలో ఈ యేడు జూలై వరకు 571 అప్రూవల్ అయ్యాయి.

పెన్నులు, పెన్సిళ్లంటే మక్కువ

- రూ.2 నుంచి 62 వేల వరకు పెన్నుల సేకరణ
- కేయూ ఉద్యోగి రాము బన్నూర్కర్ హాబీ


రాము బన్నూర్కర్ చేతిలో ప్రాణం పోసుకున్న చిత్రాలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెన్నులు, పెన్సిళ్లంటే ఆయనకు మక్కువ ఎక్కువ. కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్న రాము బన్నూర్కర్ చిన్నప్పటి నుంచే పెన్నులు, పెన్సిళ్లపై ఇష్టం పెంచుకున్నాడు. రూ.2నుంచి రూ.62వేల ఖరీదు చేసే అత్యధునికమైన పెన్నులను సేకరించాడు. ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్‌లోకి వస్తున్న పెన్నులు, పెన్సిళ్లతో స్ఫూర్తిదాయక కళాఖండాలను సృష్టిస్తూ మార్గదర్శకంగా నిలుస్తున్నాడు. పెన్నులు, పెన్సిళ్ల చారిత్రక మూలాల చెబుతూ వాటితో ఆధునిక అద్భుతాలను ఆవిష్కరిస్తున్నాడు. ప్రకృతి రమణీయతను ప్రతిబింబించే చిత్రాలతో పాటు పక్షులు, జంతువులు, పండ్లతో సృజనాత్మక చిత్రాలను అలవోకగా గీసి ఔరా అన్పిస్తున్నారు. రాము బన్నూర్కర్ చేతిలో అనేక కళాత్మక చిత్రాలు రూపు దిద్దుకున్నాయి.



దేవతలు, కార్టూన్ పాత్రలతో పాటు పండ్లు, పువ్వులు, జంతువుల చిత్రాలను సాఫ్ట్ వాటర్ కలర్, ఆయిల్ బేస్‌డ్ పెన్సిళ్లు, లిమినస్ ఫబిలో పెన్సిళ్లతో అద్భుతంగా చిత్రాలను గీశారు. హ్యాండ్ మేడ్ పేపర్‌లో సంక్లిష్టమైన దశావతర శ్రేణి పెయింట్లతో సామరస్యపూర్వక చిత్రాలను రమ్యంగా తయారుచేసి ఔరా అనిపించారు. మెటాలిక్ గోల్డ్, సిల్వర్ పెన్సిళ్లతో మెరిసే కళాఖండాలు, మల్టీకలర్ పెన్సిల్‌తో మంత్రముగ్ధులను చేసే అనూహ్యమైన ఛాయలను సృష్టించారు. సాధారణ స్కెచ్‌లతో సృజనాత్మకతను జోడించారు.

కళాత్మక చిత్రాలతో ప్రయాణం :

రాము బన్నూర్కర్, కేయూ ఉద్యోగి



సాధారణ గ్రాఫైట్ పెన్సిల్‌తో నా కళాత్మక ప్రయాణం మొదట ప్రారంభమైనది. మంచి అక్షరాలతో దీపావళి పండుగకు గ్రీటింగ్స్ చెబుతూ స్నేహితులకు రూ.2ఖర్చుతో 6, 12 రంగులుండే సాధారణ పెన్సిల్ డబ్బాల కొనుగోలుతో ప్రయాణం ప్రారంభమైంది. తర్వాత రూ. 120 జర్మనీ ఫెబర్ క్యాస్టిల్ ప్రొఫెషనల్ గ్రేడ్ సెట్లను ఉపయోగించాను. తాజాగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కళాకారులు వాడే అసాధారణమైన స్విట్జర్లాండ్ దేశానికి చెందిన 120 షేడ్ క్యారన్ డీఅర్చ్ సెట్‌లతో కళాకృతులను రూపొందిస్తున్నాను. వాస్తవానికి పెన్నులు, పెన్సిళ్లు కేవలం రచనా పరికరాలు మాత్రమే కాదు. అవి మన ఊహాశక్తికి పొడగింపులు, సృజనాత్మకతకు ఉత్ప్రేరకాలు. చిన్న ఉపకరణాలు సమాజంపై గణనీయమైన, శాశ్వత ముద్ర వేయగలవు. శక్తివంతమైన గుర్తులుగా పెన్నులు, పెన్సిళ్లను గుర్తించాలి.

సైనిక్ స్కూల్‌ను త్వరగా ప్రారంభించాలి

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఎంపీ కావ్య విజ్ఞప్తి


కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎంతో కలిసిన ఎంపీ కావ్య

హనుమకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో బుధవారం ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి, సహచర ఎంపీలతో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సమావేశమయ్యారు. వరంగల్‌లో సైనిక్ స్కూల్‌ను త్వరగా ప్రారంభించే విషయమై ప్రత్యేకంగా అభ్యర్థించారు. సైనిక్ స్కూల్ ఏర్పాటు చేస్తే యువతకు నైపుణ్యాభివృద్ధి, క్రీడా రంగంలో ప్రోత్సాహం కల్పించడంతో పాటు జిల్లా అభివృద్ధికి ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. ప్రస్తుత టీపీటీ విధానానికి బదులుగా పాత పద్ధతిలోనే సైనిక్ స్కూల్ నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీ కోరారు. సైనిక్ స్కూల్ ద్వారా విద్యార్థులు శారీరక, మానసికంగా ఎదుగుతారని, వారిని దేశ సేవలో ముందుకు నడిపించేందుకు ఇది ఒక గొప్ప అవకాశమని తెలిపారు. అంతేకాకుండా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు 98.20 ఎకరాల రక్షణశాఖ భూములు తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రికి వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

- యూరియా కోసం వెళ్లి వస్తుండగా మృతి చెందాడని బంధువుల ఆరోపణ
- జనగామ జిల్లాలో ఘటన


కాసాని ఐలయ్య (ఫైల్)

పెద్దవంగర/కొడకండ్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ రైతుకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదం జనగామ జిల్లా కొడకండ్ల మండలంలోని నర్సింగాపురంలో మంగళవారం జరుగగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కొడకండ్ల ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన కాసాని అయిలయ్య(44) అనే రైతు వ్యక్తిగత పనుల నిమిత్తం మంగళవారం కొడకండ్ల మండల కేంద్రానికి బైక్‌పై వచ్చాడు. పని ముగించుకొని తిరుగు ప్రయాణంలో మండలంలోని నర్సింగాపురం వద్దకు చేరుకోగానే రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న అందె యాకయ్య అనే వృద్ధుడిని ఢీకొట్టి కిందపడ్డాడు. ఈ సంఘటనలో అయిలయ్యకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు సంతు, కుమార్తె సమత ఉన్నారు. కాగా, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజు పేర్కొన్నారు.

యూరియా కోసం వెళ్లాడు..

కాసాని అయిలయ్య యూరియా కోసం బైక్‌పై రైతు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందినట్లు ఆయన బంధువులు పేర్కొన్నారు. వారి వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన కాసాని ఐలయ్య (44) తనకు ఉన్న వ్యవసాయం సాగుచేస్తూ గొర్రెలను కాస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పంటకు అవసరమైన యూరియా కోసం స్థానికంగా ప్రయత్నించగా దొరకలేదు. దీంతో జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామానికి చెందిన తన బావమరిది చెన్నబోయిన మల్లేశ్ పేరు మీద యూరియా బస్తాలు తీసుకునేందుకు మంగళవారం ఏడునూతుల గ్రామానికి వెళ్లాడు. అక్కడ రెండు యూరియా బస్తాలు తీసుకుని ద్విచక్రవాహనంపై వేసుకుని కాన్వాయిగూడెంలోని తన ఇంట్లో వేశాడు. మరో బస్తా కోసం కొడకండ్లకు బైక్‌పై వెళ్లగా దొరకకపోవడంతో కాన్వాయిగూడెంకు వస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదానికి గురై మృతి చెందాడని బంధువులు పేర్కొన్నారు.

పంటలకు శ్వాస.. రైతులకు ప్రయాస..

(5వ పేజీ తరువాయి)

తీవ్రనష్టాన్ని చేకూర్చుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఒక్క బస్తా చాలు..

ఇప్పుడిప్పుడే నాట్లు పూర్తి కావొస్తుండటం.. జొన్న మొక్కలు చిగురిస్తుండటం.. పత్తి కాత, పూతకు చేరుకోవటంతో పంటలకు నత్రజనిని అందించాల్సి ఉంది. ఒక్క యూరియా బస్తా అయినా ఇవ్వండి.. పంట ప్రాణం పోసుకుంటుందని రైతులు ప్రాధేయపడుతున్నారు. ఏ పంటకైనా నత్రజని కలిగిన యూరియా లేకుంటే ఎదుగుదల, పచ్చదనం ఉండదని రైతులు పేర్కొంటున్నారు. ప్రధానంగా ఆకుల పెరుగుదలను యూరియా ప్రోత్సహిస్తుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. మొక్కలను పచ్చగా, ఆరోగ్యంగా ఉంచడానికి యూరియానే దిక్కని చెబుతున్నారు. వరి పంటలో నాటు వేసిన సమయంలో తొలిసారి, 30-35రోజుల్లో రెండోసారి, 60-70రోజుల మధ్య మూడోసారి యూరియాను రైతులు పంటకు వేస్తారు. తొలిసారి నాట్ల సమయంలో వేసే యూరియాలో ఉన్న నత్రజని వరి మొక్కలకు బలాన్ని ఇచ్చి.. పచ్చగా, ఏపుగా పెరిగేందుకు దోహద పడుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. అలాగే పత్తి, మిర్చి పంటలకు కూడా నత్రజని కోసం యూరియాను రెండు విడతల్లో వినియోగిస్తారు. ప్రస్తుతం పత్తి కాత, పూత మొదలైంది. ఇలాంటి సమయంలో యూరియా కొరత అన్నదాతను తీవ్రంగా వేధిస్తోంది. యూరియా సరైన సమయంలో పంటలకు వేయకపోవటంతో పంటలకు ఎర్రతెగుళ్లు వస్తున్నాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. యూరియా లేకపోవటంతో పత్తి మొక్కలు ఎదగటం లేదని వాపోతున్నారు. అదను దాటుతోందని, ఇప్పుడు యూరియా వేయకుంటే పంటలు ఇక చేతికిరావనే ఆవేదనలో అన్నదాతలు ఆవేదనలో ఉన్నారు. దీంతో యూరియా బస్తాల కోసం సొసైటీల వద్ద జాగారం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ ప్రచారం ఏదీ ?



మార్కెట్లో తక్కువ ధరకు యూరియా లభిస్తుండటంతో మోతాదు మించి కూడా వాడకం పెరిగిందనే వానలు ఉన్నాయి. దీంతో యూరియా కొరతతో రైతులు రోడ్డెక్కాల్సి వస్తోంది. అయితే యూరియాకు ప్రత్యామ్నాయంపై ప్రచారం లేకపోవటంతోనే అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంటలు బలంగా ఉండాలంటే నత్రజని అవసరమని, దీంతో 46శాతంకు పైగా నత్రజని ఉన్న యూరియానే రైతులు పంటలకు వాడుతున్నారని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అయితే ప్రస్తుతం యూరియా కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా మార్కెట్లో లభించే అనేక ఎరువులను పంటలపై పిచికారీ చేయవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ప్రధానంగా ఒక ఎకరాకు అర లీటరు నానో యూరియాను పిచికారీ చేస్తే సరిపోతుందని, యూరియా ధరతో సమానంగానే నానో యూరియా ధరలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

19-19-19, 13-0-45, పాలిపిడ్ తదితరులు ఎరువులను యూరియాకు ప్రత్యామ్నాయంగా వినియోగించవచ్చునని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఎకరాకు 200కిలోల వేపపిండి లేదా వర్మీ కంపోస్ట్, పశువులు, గొర్రెలు, మేకుల ఎరువులను కూడా పంటల బలానికి వినియోగించుకోవచ్చని సూచిస్తున్నారు. ఆవు మూత్రం కూడా పంటలకు బలాన్నిస్తాయని అంటున్నారు. పంటలకు ఒకేసారి బస్తాల కొద్ది యూరియాను పంటలకు వేయవద్దని, విడతల వారిగా ఆయా పంటలకు అందించాలని సూచిస్తున్నారు. పత్తి పంటకు ఎకరాకు 100 నుంచి 110 కిలోల యూరియా వాడాలని, దీనిని కూడా రెండు, మూడు విడతల్లో పత్తి వేళ్లకు అడుగుదూరంలో భూమిలో వేసి, మట్టి కప్పివేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వేర్ల పైన వేయటం వలన గాలికి ఆవిరి కావటం, వర్షం పడితే నీటిలో కరిగి కొట్టుకపోవటంతో వేసిన యూరియా ప్రయోజనం లేకుండా పోతుందని సూచిస్తున్నారు. యూరియా అందుబాటులో లేనప్పుడు ప్రత్యామ్నాయ ఎరువులను వాడి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేయవచ్చునని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

కృత్రిమ ఎరువులు కూడా బలాన్నిస్తాయి..

డాక్టర్ ఎ.విజయ్‌కుమార్, సీనియర్ శాస్త్రవేత్త, కో-ఆర్డినేటర్, టీఆర్‌వీకే, వరంగల్



ప్రతీ పంటకు యూరియా అవసరమే. దుక్కులు దున్నిప్పటి నుంచి యూరియా అవసరాలు ఉంటాయి. పంటలు మొదలైనప్పటి నుంచి కనీసం ఒక్కసారైనా యూరియా వేయాలి. ప్రస్తుతం యూరియా కొరత ఉండటంతో రైతులు ప్రత్యామ్నాయం వైపు చూడాలి. కృత్రిమ ఎరువులతో కూడా పంటలకు బలం చేకూరుతుంది. ఆవు, గేదె, గొర్రెలు, మేకల ఎరువులను పంటలకు వేస్తే బలం వస్తుంది. అంతేకాకుండా మార్కెట్లో లభించే నానో యూరియా, పాలిపిడ్ వంటి ఎరువులను కూడా యూరియాకు ప్రత్యామ్నాయంగా నత్రజని కోసం వాడవచ్చు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి


చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ


ములుగులో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారి

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ములుగులోని కలెక్టరేట్‌లో బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి బీసీ వెల్ఫేర్ అధికారి తుల రవి పూలమాల వేసి నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ భూస్వాముల దౌర్జన్యాలకు తలొగ్గకుండా రైతుల పక్షాన నిలిచి వీరోచితంగా పోరాడారని, ఆమె త్యాగం, ధైర్య సాహసాలు నేటితరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈకార్యక్రమంలో రజక సంఘం నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు బీసీసంఘం ప్రతినిధులు నగరపు రమేష్, చాపర్తి రాజు, ఎన్నిండ్ల మహేందర్, పరికిరాల రవి,గూడెల్లి ఓదెలు, నేరెళ్ల శంకర్, జాలిగం శ్రీనివాస్, మొగుళ్ల భద్రయ్య, సారంగపాణి, సరిత, మానస, సౌడలు, కుమారస్వామి, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

• భూపాలపల్లి కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్యాయం, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడిన వీరవ నిత చాకలి ఐలమ్మ కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ అధ్వ ర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో ఆయ న మాట్లాడారు.

చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. చాకలి ఐలమ్మ చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రజక సంఘం నాయకులు కల్లూరి సతీష్, బోనగిరి సాయికుమార్, శ్రీను, అంగన్ వాడీ టీచర్ సీత తదితరులు పాల్గొన్నారు.

• కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం మండల అధ్యక్షుడు పైడాకుల సమ్మయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. బీసీ జేఏసీ మండల అధ్యక్షుడు ముదురుకోళ్ల భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేములవాడ రమేష్, శ్రీరాముల సందీప్, ముక్కెర సాయి, మహేందర్, శ్రీనివాస్, సాంభయ్య, అంజయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో చాకలి ఐలమ్మ వర్ధంతిని రజకసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, రజక సంఘం మండల అధ్యక్షుడు పున్నం రాజయ్య, నాయకులు మూసాపురి నర్సయ్య, పున్నం శంకర్, ఐలయ్య, లచ్చయ్య, సుమన్, పెనుగొండ రాజయ్య, కల్లగుంట సురేష్, పైడాకుల సురేష్, బీఆర్ఎస్‌వై మండల అధ్యక్షుడు కిరణ్, సీపీఎం మండల కార్యదర్శి ఆత్మూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

• మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లతోపాటు వల్లెంకుంటలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు పావురాల ఓదెలు, ఉపాధ్యక్షుడు కనుకుల రాకేష్, పైడాకుల సమ్మయ్య, లక్ష్మయ్య, రాజసమ్మయ్య, పోచమల్లయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ వర్ధంతిని ఏటూరునాగారం వై-జంక్షన్‌లోని ఆమె విగ్రహం వద్ద నిర్వహించారు. ఐలమ్మ మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సి.హెచ్. దళిపతి(చలపతి) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐటీడీఏ ఏపీవో జె. వసంతరావు, సీఐ అనుముల శ్రీనివాస్ హాజరై ఐలమ్మ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ వర్ధంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా జరిగాయి. ఎస్సై ఎస్. రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీవో, బీసీ వెల్ఫేర్ అధికారులతో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, మాజీ జడ్పీటీసీ ఎమ్డీ. వలీయాబీ, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, ఐలమ్మ మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షుడు పర్వతాల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని చేపట్టిన పలు అభివృద్ధి పనులను అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. పట్టణంలోని సుభాష్‌కాలనీలో నిర్మాణంలో ఉన్న మినీ స్టేడియం పనులను పరిశీలించారు. అలాగే ప్రధాన రోడ్డులో మంచినీటి పైపులైన్ లీకేజీ అవుతుండటంతో వెంటనే సంబంధిత సిబ్బందికి ఫోన్‌చేసి బాగు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట మునిసిపల్ టీపీవో సునీల్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ మానస తదితరులు ఉన్నారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడిగా రవి కుమార్


రవికుమార్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్య

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల వేదిక (ఎన్‌హెచ్ఆర్‌సీ) జిల్లా అధ్యక్షుడిగా తాటికంటి రవికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య తెలిపారు.. భూపాలపల్లిలో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు దుండ్ర కుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య సారథ్యం వహించగా పలువురిని జిల్లా కమిటీలోకి ఎంపిక చేశారు. ఇందులో నూతన జిల్లా అధ్యక్షుడి రవికుమార్‌తోపాటు ప్రధాన కార్యదర్శిగా వేల్పుల మహేందర్, ఉపాధ్యక్షులుగా సంగెం రాజేందర్, నాంపల్లి వీరేశం, సంయుక్త కార్యదర్శులుగా మేరుగు సురేష్‌గౌడ్, శిలపాక నరేష్, ప్రచార కార్యదర్శులుగా బూర ముక్తేశ్వర్, అధికార ప్రతినిధిగా జోగుల సంపత్, భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడుగా ఇప్ప కాయల రాధాకృష్ణ, మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడిగా బెల్లెపల్లి రాజ్ కుమార్, గణపురం మండల అధ్యక్షుడిగా జగన్ ఎన్నుకున్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు దుండ్ర కుమార్‌ను రాష్ట్ర కమిటీలోకి ఆహ్వానించారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం బ్యారేజీలోకి వచ్చే ఇన్‌ఫ్లో 1.59 లక్షల క్యూసెక్కులుగా నమోదు కాగా గేట్లన్నీ ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 3.01 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రాజ్యాధికారమే లక్ష్యం : బీఎస్పీ

టేకుమట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బహుజనులకు రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి అన్నారు. మండలంలోని కుందనపల్లి గ్రామంలో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించగా జిల్లా అధ్యక్షుడు భిక్షపతి హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అనేది కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు ఆడుతున్న దొంగ నాటమన్నారు. అధిక శాతం ఉన్న బహుజనులు ఐకమత్యంతో పని చేస్తేనే రాజ్యాధికారం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర నాయకులు సంగి రవి, కొయ్యాడ దామోదర్, జిల్లా ఇన్‌చార్జి బచ్చల రామస్వామి, ఉపాధ్యక్షుడు మేకల ఓంకార్, కార్యదర్శి తాళ్లపల్లి రమేష్, నాయకులు కోడెపాక విజయ, పుల్యాల భరత్, రాజకొమరయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మధు పరామర్శ

కాటారం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పర్యటించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. బొప్పారం, రేగులగూడెం, శంకరంపల్లి బేడ బుడగజంగాల కాలనీలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన మంథెన రాములు, చిగురు బాలమ్మ, తూర్పాటి రమేష్‌ల కుటుం బాలను మధు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ఇంచార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు జక్కు రాకేష్, ఊర వెంకటేశ్వర్‌రావు, సంతోష్ శ్రావణ్, రాజబాపు, బాలరాజు, దుర్గారావు, మహేష్, మురారి, మనోహర్, వంశీ, రవి తదితరులు ఉన్నారు.

మహిళలకు వృత్తి విద్యా కోర్సులు

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో తర్ఫీదు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి తెలిపారు. ఈ మేరకు బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ (డీటీపీ), మగ్గం వర్క్స్, స్పోకెన్ ఇంగ్లిష్, ఫొటోషాప్, మల్టీ మీడియా, జ్యూట్ బ్యాగ్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సింగరేణి ఉద్యోగి కుటుంబ సభ్యులు, సింగరేణి పరిసర ప్రాంతాల మహిళలు అర్హులని అర్హులని పేర్కొన్నారు. అలాగే, టైలరింగ్‌లో సైతం శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25లోగా ఎస్ఎస్‌సీ మెమో, ఆధార్‌కార్డు, ఉద్యోగి ఐడెంట్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు కుల ధృవీకరణ పత్రం రెండు సెట్లతో ఏరియా పర్సనల్ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి

• భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనల నిర్మాణం వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాల నిర్మాణం, మహిళలకు వ్యాపార, నైపుణ్య అవగాహన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ భవనాల నిర్మాణం లోపాలు లేకుండా నాణ్యతతో పాటు వేగం పెంచాలన్నారు. కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించకుండా భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా కృషిచేయాలన్నారు. భూపాలపల్లి మండలం పంబాపూర్ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యం జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. మహిళలకు వ్యాపార సృజనాత్మకత నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికతపై అవగాహన కల్పించా లన్నారు. వ్యాపార విస్తరణకు అవసరమయ్యే శిక్షణ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వయం సహాయక మహిళలు తయారు చేసే వస్తువులకు ప్రపంచ వ్యాప్తంగా మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు. మహిళలకు వ్యాపార ప్రణాళికలు, డిజిటల్ మార్కెటింగ్, ఆర్థిక వనరుల వినియోగం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్డీవో బాలకృష్ణ, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, డీపీవో మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరులకు మూడెకరాల భూమిని కేటాయించాలి

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుమ్మరి వృత్తిలో ఉన్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం మూడెకరాల చొప్పున భూమి ఇవ్వాలని తెలం గాణ కుమ్మర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం, ఓదెల చంద్రరావు డిమాండ్ చేశారు. భూపాలపల్లిలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆవునూరి రామన్న, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆకారపు శంకర్, నాంపల్లి అయి లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమ్మర సంఘం జిల్లా అధ్య క్షుడిగా కొండపర్తి ఇస్తారిని, ప్రధాన కార్యదర్శిగా బిక్కనూరి సుదర్శన్, అసోసియేట్ అధ్యక్షుడిగా సముద్రాల రాజును ఎన్నుకున్నారు.

పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి కుమార స్వామి


చల్లగరిగలో పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి

చిట్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి కుమారస్వామి అన్నారు. మండలంలోని చల్లగరిగ గ్రామంలోని పశు వైద్య ఆస్పత్రిని ఆయన బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి, పాడిరైతులతో మాట్లాడారు. పశువుల ఆరోగ్యం పట్ల వైద్యులు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఏవైనా అస్వస్థత లక్షణాలు కనిపిస్తే చికిత్సలు అందించాలన్నారు. పశు వైద్య కేంద్రాల్లో లింగ నిర్ధారిత వీర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ఆయన వెంట పశువైద్య అధికారి డాక్టర్ అజయ్ అప్పాని ఉన్నారు.

అతివలదే ఆధిక్యత

కాటారం డివిజన్‌లో మహిళా ఓటర్లే ఎక్కువ

కాటారం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాటారం డివిజన్‌లో మహిళా ఓటర్లదే అధికంగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాల్లో గెలుపోట ములను నిర్ణయించడంలో అతివలే కీలకమని గణాంకాలు చెబుతు న్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికార యం త్రాంగం ఓటర్ల జాబితాను జీపీలు, ఎంపీటీసీ స్థానాల వారీగా డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేపట్టగా డివిజన్ వ్యాప్తంగా పురుషుల కన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లు తేలింది. అన్ని రంగాల్లో 50 శాతం కోసం పోటీ పడటానికి సిద్ధమనే అతివలు ఓటర్ల సంఖ్యలో అంతకుమించి ఉండటం విశేషం. కాటారం డివిజన్ పరిధిలో కాటారం, మహాముత్తారం, మల్హర్‌రావు, మహదేవపూర్, పలిమెల మండలాలు ఉన్నాయి. కాటారం డివిజన్ పరిధిలో 1,05,129 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 54,027 మంది మహిళా ఓటర్లు, 51,092 పురుష ఓటర్లు, 10 మంది ఇతరులు ఉన్నారు. ఐదు మండలాల్లోనూ పురుషల కన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. డివిజన్ వ్యాప్తంగా పురుషల కన్నా 2,935 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

• కాటారం మండలంలో 24 గ్రామ పంచాయతీలు, 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటిలో అధికారులు 57 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో 30,785 ఓటర్లు ఉండగా వారిలో 15,894 మంది మహిళలు, 14,883 మంది పురుషులు, 8 మంది ఇతరులు ఉన్నారు. మండల వ్యాప్తంగా పురుషల కన్నా 1,011 మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

• మహదేవపూర్ మండలంలో 18 గ్రామపంచాయతీలు, 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటి పరిధిలో 48 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. మండలంలో 25,434 మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళా ఓటర్లు 13,170, పురుష ఓటర్లు 12,262 మంది, ఇద్దరు ఇతరులు ఉన్నారు. మండల వ్యాప్తంగా పురుషల కన్నా 908 మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

• మహాముత్తారం మండలంలో 24 గ్రామపంచాయతీలు, 8 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటి పరిధిలో 42 పోలింగ్ స్టేషన్లు ఉండనున్నాయి. మండలంలో 20,913 మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళా ఓటర్లు 10,622, పురుషులు 10,291 ఉన్నారు. మండల వ్యాప్తంగా పురుషల కన్నా 331 మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

• మల్హర్ మండలంలో 15 గ్రామపంచాయతీలు, 7 ఎంపీటీసీ స్థానాలుండగా వాటి పరిధిలో 46 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 22,446 మంది ఓటర్లు ఉండగా వారిలో 11,479 మంది మహిళా ఓటర్లు, 10,967 మంది పురుష ఓటర్లు ఉన్నారు. పురుషల కన్నా 512 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

• పలిమెల మండలంలో 8 గ్రామ పంచాయతీలు, 5 ఎంపీటీసీ స్థానాలు (పాతవి3, కొత్తగా 2) ఉండగా వాటి పరిధిలో 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 5,551 మంది ఓటర్లు ఉండగా వారిలో 2,862 మంది మహిళలు, 2,689 మంది పురుషులు ఉన్నారు. పురుషల కన్నా 173 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

శవ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ బీఆర్ఎస్

(5వ పేజీ తరువాయి)

కుటుంబానికి రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియాను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహేష్ మృతికి కారకులైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ఉద్దేశపూర్వకంగా వివాదం చేయడం, పభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. దందాలు చేసే నాయులు మృతుడి పేరుతో జోలెలు పట్టి అడుక్కోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, ములుగు మునిసిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

డబ్బుల కోసం వేధిస్తున్నాడని..

(5వ పేజీ తరువాయి)

రాలేదు. దీంతో విసిగి పోయిన సూరయ్యతోపాటు అతడి పెద్దకుమా రుడు సంపత్, తమ్ముడు సాంబయ్య ఓ నిర్ణయా నికి వచ్చారు. అశోక్ మళ్లీ గొడవకు వస్తే అతడిని చంపాలనుకున్నారు. ఈనెల 7న సాయంత్రం మద్యంమత్తులో ఇంటికి వచ్చిన అశోక్ డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని తండ్రిని బెదిరించాడు. దీంతో అక్కడే ఉన్న సాంబయ్య తాడుతో అశోక్ మెడకు చుట్టి లాగాడు. సూరయ్య కాళ్లను పట్టుకోగా, సంపత్ తాడును బిగించి హతమార్చారు. అనంతరం మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని డ్రైవర్ తీగల రమేష్ సహాయంతో లక్ష్మీదేవిపేటకు తీసుకెళ్లి ఇంటి రేకులషెడ్డు కింద బల్లాపై వేసి ఏమీ తెలియనట్లు తిరిగి ములుగు చేరుకున్నారు. పోలీసులు కేసు విచారిస్తున్న క్రమంలోనే కాంగ్రెస్ నాయకుడొకరి ద్వారా నలుగురు నిందితులు ములుగు సీఐ ఎదుట లొంగిపోయారు. దుర్గం సంపత్, దుర్గం సాంబయ్య, దుర్గం సూరయ్య, డ్రైవర్ తీగల రమేష్‌ను అరెస్టుచేసి ములుగు కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం, తాడును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి : కలెక్టర్

గణపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గాంధీనగర్‌లోని మహాత్మాగాంధీ జ్యోతి బా పూలే బాలికల పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. పాఠశాల వాతావరణం, విద్యాబోధన, భోజన విధానాలను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యాలను మెరుగుపరిచే దిశగా ప్రహరీ నిర్మాణం, డ్యూయల్ డెస్క్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు.

అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రేగొండ, కొత్తపల్లి గోరి మండలాల్లోని వివిధ గ్రామాల్లో రూ.14.75కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. అంతర్గత రోడ్లు, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు ఇబ్బందులు కుగకుండా పంట పొలాలకు వెల్లడాని దారులను ఏర్పాటు చేయడానికి నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, తాహసిల్దారులు లక్ష్మీ రాజయ్య, స్వేత, మార్కెట్ కమిటీ చైర్మన్ విజ్జన్‌రావు, రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, నాయకులు గాజర్ల అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు నర్సయ్య , మేకల భిక్షపతి, ఏనుగు రవీందర్ రెడ్డి, గుర్రం రవి, మైన భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గుడిగుట్టల సమీపంలో కూలిన కల్వర్టు

వెంకటాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పరిధి గుడిగుట్టల సమీపంలో రోడ్డుపై ఉన్న కల్వర్టు బుధవారం కూలింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుడిగుట్టల సమీపంలోని స్లాబ్ కల్వర్టు కొన్నిరోజుల క్రితం కుంగిపోయిందని అన్నారు. కాగా, కల్వర్టు పైనుంచి హెవీలోడ్ ఉన్న ఇసుక లారీలు వందలసంఖ్యలో ప్రతిరోజు వెళ్తుండడంతో బుధవారం తెల్లవారుజామున కొంతమేర కూలిపోయి ప్రమాద భరితంగా మారిందని అన్నారు. ఇసుక లారీలు, భారీ వాహనాలు ఈ కల్వర్టుపై నుంచి ప్రయాణిస్తే పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ములుగు టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న గురుకులేతర ఎనిమిదో తరగతి విద్యార్థులు నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్ పొందటానికి అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.సిద్ధార్థరెడ్డి, ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి అప్పని జయదేవ్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అర్హత పరీక్ష ద్వారా ఎంపికయ్యే విద్యార్థులు తొమ్మిది, పదో తరగతులు, ఇంటర్ వరకు నాలుగు సంవత్సరాలు నెలకు రూ. వెయ్యి చొప్పున మొత్తం రూ. 48 వేల స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరిస్తాం

సంక్షేమ శాఖ జిల్లా అధికారి రవి

ములుగు రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తమ దృష్టికి వచ్చిన సీనియర్ సిటిజన్స్ సమస్యలను కచ్చితంగా పరిష్కరిస్తామని సంక్షేమ శాఖ జిల్లా అధికారి తులా రవి అన్నారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ (హనుమకొండ) ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్తులు తీసుకుని తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లల నుంచి ఆస్తిని తిరిగి వెనుకకు తీసుకునే చట్టం మనుగడలో ఉందని తెలిపారు. బాధిత తల్లిదండ్రులు ఆ ప్రాంతంలోని కలెక్టర్, ఆర్డీవోను సంప్రదించొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య, బాసాని రామ్మూర్తి, కంజంపురం దామోదర్, తేరాల యుగేందర్, కొట్టి రాజిరెడ్డి, వెంకట్ రెడ్డి, చందర్ రావు, సంజీవ రావు, సోమ నర్సయ్య పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితాను ప్రదర్శించిన అదనపు కలెక్టర్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ములుగు కలెక్టరేట్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీల వారీగా ఓటర్లు, పోలింగ్‌స్టేషన్ల తుది జాబితానుఅదనపు కలెక్టర్ సంపత్‌రావు అధికారులు, సిబ్బంది సమక్షంలో బుధవారం ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 10 జడ్పీటీసీ, 83 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మొత్తం 473 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,29,159మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారని అన్నారు. ఇందులో పురుషులు 1,10,838మంది, మహిళలు 1,18,299మంది ఉన్నారని పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

కన్నాయిగూడెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుపా కుల గూడెం, బుట్టాయిగూడెం, చింతగూడెం, లక్ష్మీపురం గ్రామాల్లో ఆరుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎం.డి.అఫ్సర్‌పాషా బుధవారం పంపిణీ చేశారు. అనంతరం చింతగూడెంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ భూమి పూజకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సునార్కని రాంబాబు, నాయకులు సాంబశివ రావు, కుమార్, సురేందర్, ప్రభాకర్, బాస్కర్, చీదారి సుమన్, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు యూరియా పంపిణీ

గోవిందరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గోవిందరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులకు ఈనెల 11న యూరియా పంపిణీ చేయనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు పన్నాల ఎల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5న టోకెన్లు తీసుకున్న రైతులు మాత్రమే కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

వెంకటాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజనేతరుల కాస్తుకబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో నాయకులు బుధవారం తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు తాటి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ మండలకేంద్రంలోని ప్రభుత్వ భూమిని గిరిజనేతరులు ఆక్రమించుకుని క్రయవిక్రయాలు జరుపుతున్నారని ఆరోపించారు. ఈవిషయంలో రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూమిని సర్వేచేసి స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు కుడుముల నిరంజన్, కోరం ప్రసాద్, రామచంద్రప్రసాద్, పూనెం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ బి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా 11 కేవీ ములుగు- 2 ఫీడర్ పరిధిలోని పత్తిపల్లి రోడ్ కూరగాయల మార్కెట్ రోడ్డు, మసీదు వెనుక, మునిసిపల్ ఆఫీస్ ప్రాంతం, నాగర్షిణి రైస్ మిల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలి: ఎస్ఎఫ్ఐ

వాజేడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు బోదెబోయిన సాయి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆయన బుధవారం సందర్శించారు. వసతి గృహం భవనానికి మరమ్మతులు చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనన్ని అందించాలని డిమాండ్ చేశారు.

సేకరించిన విరాళాల అందజేత

ములుగు టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ములుగు మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికుడిగా పనిచేసిన మైదం మహేష్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు తాము సేకరించిన రూ. 1,01116 విరాళాలను బుధవారం అందించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఈ సందర్భంగా మాట్లాడుతూ మహేష్ మృతికి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని విమర్శించారు. మృతుడికుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి భిక్షపతి, గొర్రె సమ్మయ్య, దూడబోయిన శ్రీనివాస్, సానికొమ్ము రమేష్ రెడ్డి, చెన్న విజయ్, విజయరామ్ నాయక్, ఆకుతోట చంద్రమౌళి, గండి కుమార్, గడ్డం భద్రయ్య, గజ్జి నగేష్ తదితరులు పాల్గొన్నారు.